"ఒరే సూరీ! బంతులేవీ? చూశావా, నన్ను నమ్ముకుంటే బాగుపడవు. బంతుల్లేకుండా ఎలా ఆడతాం?"

"అన్నీ ఉన్నై. నీ తెలివితేటలమీద ఆధారపడలేదు నేనూ. వాటి సంగతి నాకు బాగా తెలుసు."

వాడి మాటల్లో నిష్ఠూరం నేను వినిపించుకోదలచలేదు.

"బాగానే ఉంది కాని నా కీ ఆట బాగా రాదే! నేను ఒకటి రెండుసార్లు ఆడాలని ప్రయత్నం చేస్తే బాటులోనించి బాలు దూరిపోవటం చూసి నా బాటుకు కంతలున్నాయని అందరూ కనుక్కున్నారు. నాతో ఏం పనవుతుంది?"

"నీతోనే అవుతుంది. చూస్తూ ఉండు."

అప్పటికింకా నాలుగైదు గడియల పొద్దుంది. నా నెత్తిన బంతీ, బాటులూ, నెట్టూ పడేసి తాను రెండు బొంగులూ, ఒక తవ్వుకోలా, టేపు తీసుకుని సూరి దారి తీశాడు. ఊరి బయట చింతల మధ్య కోర్టుకు సరిపోయే చక్కని సమప్రదేశం ఉంది. పది పదిహేను నిమిషాలకల్లా సూరి కోర్టు సిద్ధం చేశాడు. అవసరమైన గీతలూ అన్నీ గీసి గుంటలు తవ్వి, గుంజలు పాతాం.

మొత్తానికి మా సూరి చాతయిన మనిషి. అఖిల భారత గ్రామ పునర్నిర్మాణ మహాసభ ఒకటి ఏర్పాటు చేస్తే బాడ్మింటన్ బ్రాంచికి మా సూరాయి అద్భుతమైన అధ్యక్షుడవుతాడు. ఒక గంటసేపు ఆడి తట్టా బుట్టా నెత్తినేసుకుని ఇంటికి వస్తుంటే సూరి "నీ ఆట. మాచికి అట్టే చెప్పకుగాని, నా పనికి బాగా ఉపకరిస్తుంది" అని, పైన చెప్పటం మరిచిపోయినాడు.

మర్నాడు మా ఆటకు ప్రేక్షకులు వచ్చారు. మా ఆట వాళ్ళకు చాలా సంతోష కారణమైనట్టు కనపడ్డది. దానిక్కారణం ఆటలో నాకు గల నైపుణ్యమేనని నాకీ నాటికీ కొద్దిగా అనుమానం ఉండనే ఉంది. నన్ను చూసి నవ్వితే నవ్వారు కాని మా వాడి ప్రయత్నం కొనసాగుతున్నందుకు సంతోషించాను.

ఈ విధంగా రెండు రోజులు గడిచింది. ప్రేక్షకులు వచ్చి చూచి సంతోషించినవాళ్ళే కాని ఆడే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. సూరి ఎవ్వరికీ ఆడమని ఆహ్వానం చెయ్యనైనా లేదు. వాళ్ళసలు ప్రేక్షకులనటానిక్కూడా నా కంత మనస్కరించటం లేదు. వాళ్ళలో ఒక భాగం గొల్లపిల్లలూ, ఇంకో భాగం సంసార్ల పిల్లలూ, కొద్దిమంది ఆడపిల్లలూ, ఒకటి రెండు గొడ్లూ, ఒక కుక్కా – కొన్ని కోళ్ళూ అవి కూడా మధ్య మధ్య మా ఆట చూసి నవ్వుతూ పురుగులేరుకుంటూ అటూ ఇటూ షికారు చేస్తుండేవి.

నేనీ పరిస్థితులు సూరితో ముచ్చటించా.

"నువ్వు తొందరపడకు" అన్నాడు సూరి.

